స్కెచ్

# అజెండాలేని మీటింగు

"పారిజాత"

అత్యవసర సమావేశానికి ధర్మారావు నోటీసులు జారీ చేయించాడు స్వయంగా దగ్గరుండి. ఇటువంటి సమావేశాలు ఆ మునిసిపాలిటీకి కొత్త కాదు. అజెండాలేని మీటింగులు ఎన్నో జరుగుతుంటాయ్. మెంబర్లుకూడా ధర్మారావుకు చేదోడుగా వుంటూ స్వపరిపాలనాధికారాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తూంటారు.

ఆ మునిసిపాలిటీలో పార్టీలకేం కొదవలేదు. రాష్ట్రంలోవున్న పార్టీలన్నీ అక్కడ వుండక పోయినా వాటికీ రిప్రజెంటేషన్ అంటూవుండక పోలేదు.

అసలు ఛైర్మన్ ధర్మారావు పోటీలేకుండా కౌన్సిలర్‌గా ఎన్నికై లాటరీలో ఛైర్మన్ పదవి నలంకరించాడు. ఇక వైస్-ఛైర్మన్ ముకుందరావు లాటరీగా కౌన్సిలర్ పోటీలేకుండా వైస్-ఛైర్మన్‌అయి కూర్చున్నాడు.

ధర్మారావుకు ఛైర్‌మన్ పదవి కొత్తకాదు. ఆయనకి ప్రత్యేకంగా ఒక "గ్రూపు" కూడాలేదు. ముకుందరావు సాక్షాత్తూ ధర్మారావు పోలికే. ఈ యిద్దరికీ స్నేహం ఎంతో కాలంనుంచీ లేక పోయినా మునిసిపల్ అధికారం చేతిలోకొచ్చిన పిమ్మట వారులేని ప్రదేశం లేదేమో అనిపించేలా వుండేవారు.

ఇటువంటి వాతావరణంలో మునిసిపల్ వ్యవహారాలు ఎల్లా సాగాయా అనీ, ఒకటి తక్కువ ముప్ఫయ్ మెంబర్లూ ఎల్లా సహించగలిగారని కొందరికి అనుమానం రావచ్చు! రావడంలో కూడా సందేహంలేదు. అక్కడేవుంది — "ధర్మారావు అండ్ ముకుందరావు" పార్టీ కీలకం. అదే మరో విధంగా చెప్పాలంటే—"రావ్ అండ్ రావ్" కంపెనీ లోగుట్టు.

రెండు పక్షాలూ నిలబెట్టిన అభ్యర్థుల తగవులాటలో యిరుపక్షాలూ రాజీనామాపడి, గత్యంతరంలేక ధర్మారావును అధ్యక్షునిగా ఆహ్వానించారు. కాని యీ కోరిక కొన్ని ముఠాలకు యిష్టంలేక మరొకర్ని పోటీకి నిలబెట్టి అదృష్టాన్ని పొందలేక లాటరీలో అపజయం పొందారు.

ఇట్లాంటిముఠాలని జాగ్రత్తగా పాలిస్తూ ధర్మారావు రోజులను వెక్కిరిస్తూ వ్రేళ్ళతో నెమ్మదిగా నెట్టుకొస్తున్నాడు. పురపాలక సంఘంలో అన్ని ముఠాలకూ ప్రాతినిధ్యం కల్పించి, అందర్నీ సుముఖులుగా చేసుకొన్నాడు. ఏ మంత్రిగారొచ్చినా, అధమం ఏమాత్రం పేరున్న వ్యక్తి అరుదెంచినా స్టేషన్‌పోయి, పూలమాలలతో ఆహ్వానించి, చక్కని పోజుతో ఫొటోతీయించి, అది పేపర్లలో ప్రకటించుకొని, కాపీలను మెంబర్లందరకీపంచి పెట్టించడం, అతని చర్యలలో ఒకటి. అతని స్వగృహంలోని ఆఫీసురూమ్ ఇందుకు ప్రబలసాక్ష్యం. ఫొటోలు ఒక వరుస చాలక రెండు వరుసలు మించిపోయి 'మూడోవరుసతో ఆ నాల్గు గోడలు ముద్దొస్తూంటాయ్ చూపరులకు.

మీటింగుకు మెంబర్లందరూ సకాలంలో— ఆయాసం లేకండా రావటానికి కారు సర్వీసు ఏర్పాటు చేశాడు. తీరికసమయాల్లో మాట్లాడు కోడానికి కొన్ని సమయాల్లో అంతరంగిక తక్షణ చర్యలు తీసుకోవడానికీ వీలుగావుండే విధంగా మెంబర్లదరికీ మునిసిపాలిటీ ఖర్చుమీద టెలిఫోను సౌకర్యం కలిగించాడు.

మునిసిపల్ మెంబర్లు, అధ్యక్ష ఉపాధ్యక్షులు నివసిస్తూన్న వీధులన్నీ సిమెంటురోడ్లు వేయించి శానిటేషన్ సౌకర్యాలు కలిగించాడు. (మెంబర్లలో మూడు వంతులకు పైన సందులలో అంటే చిన్నవీధులకు అంటి వుండేసందులలో నివసించేడి వారే)

ఎన్నికలు అయి చాలాకాలం గడిచి యింత వరకూ జయప్రదంగా అందర్నీ మెప్పించి తన మర్యాదను కాపాడుకుంటున్నాడంటే నిజంగా ఆ ఘనత అధ్యక్ష ఉపాధ్యక్షులలో ఎవరికెంత

పెర్సంటేజి దశాంశలలో లెక్కించడం; అధమం ఊహించడం కూడా కష్టమే.

పట్టణంలోని ముఖ్య రహదారులనూ, శానిటేషన్ వీధులనూ, అందు నిమిత్తమై గావించిన ఏర్పాటులనూ స్వయంగా తనిఖీచేసే నిమిత్తం మంత్రిగా రోస్తున్నారని—మునిసిపాలిటీకి కబురొచ్చింది-కమీషనర్ (అంటే యీాయనగారు యీా కౌన్సిల్ అధికారంలోకి వచ్చిన పిమ్మట అయిదవ ప్రతినిధి అన్నమాట) ధర్మారావుకూ, ధర్మారావు ముకుందరావుకూ తెలియపర్చుకోగా జరిగిన ఏర్పాటే—ముందు తెల్పిన అత్యవసర సమావేశమన్న మాట—

ఇటువంటి వాతావరణంలో సమావేశంజరపడం అత్యవసరమే అయినా సమావేశం జరగటానికి సభ్యులు అంత సుముఖంగా లేరు. ముఠాలతో విసుగెత్తిపోయి ధర్మారావుయొక్క ముఠా పక్షపాతంవల్ల జరిగే చర్యలూ సభ్యుల్ని కొంత రభస పరచేయి.

రోడ్డుమీాదకు వచ్చిందన్న కోపంతో రూల్సుకు వ్యతిరేకంగా వున్నదనే కారణంతో అసలు కీలకం వేరేవున్నా దయానందం సైకిలుషాపు గంటలలో ఎత్తించివేయడం; శ్రీనివాసరావు కాఫీక్లబ్ శానిటేషన్ రూల్సుకు వ్యతిరేకంగా వుందనే నెపంతో నెలరోజులు మూయించి వేయడం; ఉన్నత పాఠశాలను వృద్ధిలోకి తీసుకురావడంపోయి దానిని మాధ్యమిక పాఠశాలగా మార్చి తద్వారా అసలే పెరిగిపోయిన నిరుద్యోగ సమస్యను పెంచడం, ముఖ్యమైన రాస్తాలను మర్చిపోయి పనికిరాని గొందులను అలంకరించడం మండు వేసవి కాలంలో కుళాయిలను కొన్ని పేటలకు వదలి—కొన్నిటికి టైమ్ టేబిల్ ప్రకారం వదలి కొన్నిటిని మరచిపోయి వారి ఆగ్రహానికి పాలుకావడం మొదలైన పనులతో మునిసిపాలిటీ నవ్వులపాలు కావాల్సి వచ్చింది. ఇది ఇందర్ని సంతోషపరచటానికి చేయాల్సివచ్చినమాట వాస్తవమే అయినా వెనువెంటనే కొందర్ని ఉద్రిక్తులను చేసింది.

ఇటువంటి కోపాలు కొందరిలో దాగివున్నాయ్. కొందరు దాచలేక సమావేశాలలో వెళ్ళగ్రక్కేరు. అయినా వాటిగురించి తగు శ్రద్ధ తీసుకోలేదని యీా అత్యవసర సమావేశం తెల్పుతూనేవుంది.

ధర్మారావూ ముకుందరావూ, కమిషనరూ సభ్యులకోసం ఎదురు చూస్తున్నారు. ఒక్కొక్కరే వస్తున్నారు. సభ్యులకోసం వెళ్ళినకారు అయిదుగుర్ని మాత్రమే తీసుకురాగల్గింది. కొందరు కారు ఎక్కటాన్కి నిరాకరించి కాబోలు ఠీవిగా కాలినడకను పెంచేశారు. ఒకరిద్దరు మాత్రం సైకిలు రిక్షాలపై వచ్చేరు. అంతా హాలులో ఆసీనులయ్యారు. మొత్తం సభ్యులలో మూడోవంతు రాలేదని "కోరా"నికి సరిపడే మెంబర్లు లేరనీ తెల్పి నిరసనగా వాకౌట్ చేశాడు ప్రతిపక్ష నాయకుడు యిద్దరి ముఠాతో. చర్చించవలసిన విషయం ఏమిటో తెలియక వచ్చిన మెంబర్లు ధర్మారావుకేసి చూస్తున్నారు. కమీషనరు ఏమీా తోచక కాబోలు తన గదిలోకి వెళ్ళిపోయాడు. ముకుందరావు ధర్మారావుకేసి చూడగానే ధర్మారావు టేబుల్ మీాదవున్న "కాన్ఫిడెన్షియల్ అండ్ అర్జంటు" ఫైలును చంకన బెట్టుకుని చరచరా బయటకు వెళ్ళిపోయాడు - బుర్ర కడుముకొంటూ.

---

సమకాలిక ప్రజాస్వామిక విధానములు నియంతృత్వ వాదుల సవాలును ఎదుర్కొనుటకు నూతన రాజకీయ శక్తిని కలుగచేయాలి. ఈ శక్తి పరస్పర వ్యతిరేక సాంఘిక సంస్థలను అంగీకార యోగ్యమయిన ఏకీభావమునకు నడుపకలగాలి. ప్రజాస్వామిక విధానంలో సాధ్యమైనంత తక్కువ వ్యవధిలో ఇట్టి నూతన విధానము అనుసరింపబడాలి. లేనియెడల ఏదో ఒక రూపములో నియంతృత్వ విధానము జయప్రదము కాగలదు.

—మెన్హీమ్.